


# వడ్డించిన-చెయ్యి

పెళ్ళిపందిరి, లోపల పిలిచినవాళ్ళతోటి, బయట పిలవనివాళ్ళతోటి హడావుడిగా ఉంది సుముహూర్తం అయిపోయింది. పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు అభినందనలు, బహుమానాలు స్వీకరిస్తున్నారు. భోజనాలకు ఒక పక్కన ఏర్పాట్లు అవుతున్నాయి. విస్తర్లు వేస్తున్నారు. కన్యాదానం, కట్నదానం చేసిన పరంధామయ్య మరొకపక్కగా మంచానికి చేరగిలబడ్డాడు. ఈ దానాలు చెయ్యటానికి ఎంత అప్పు అయిందో గుర్తుకి తెచ్చుకుంటున్నాడు. షామియానావాళ్ళకీ, బట్టలదుకాణంవాళ్ళకీ బాకీలు తీరుస్తే మొత్తం ఎంతయేదీ లెక్కవేస్తున్నాడు. అల్లుడు అలిగితే రిస్టువాచీ కొనివ్వాలని అనుకున్నారు. అది ఎగగొట్టటానికి ఏం కారణం చెబితే బాగుంటుందీ ఆలోచిస్తున్నాడు. కొన్నిటికి సమాధానాలు దొరుకుతున్నాయి. మరికొన్నిటికి ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

"ఏమయ్యా బావా! నీ కూతురి పెళ్ళికి మేమంతా నడుములు విరగ్గొట్టుకుంటున్నాం నువ్వేమో హాయిగా జేరగిలబడి కలలు కంటున్నావు" అన్నాడు వెంకట్రామయ్య, లడ్డూల పళ్ళెం పట్టుకుని వడ్డనకు ఉపక్రమిస్తూ.

"నీ చెల్లెలి కూతురని చేస్తున్నావు. నా పనైతే నువ్వసలు కనిపించేవాడివటయ్యా! వెధవ్వేషాలెయ్యక వడ్డించు. ఎవరికోసం చేస్తావు" పరంధామయ్య నవ్వుతూనే లేచాడు.

"రెండో స్వీటు ఏమన్నా ఉందా లేదా..." వెంకట్రామయ్య వడ్డిస్తూనే ఒక లడ్డూ నోట్లో వేసుకున్నాడు.

"బాగానే కట్టాడయ్యా లడ్డు పచ్చకర్పూరం, కుంకుమపువ్వూ వేయించినట్లున్నావు. సిగదరగ గుమాయిస్తున్నాయి." వెంకట్రామయ్య లడ్డు నములుతున్న వేగంలో వడ్డిస్తూ, అంత వేగంగానూ మాట్లాడుతున్నాడు. పచ్చకర్పూరం అనగానే పరంధామయ్యకు మరో విషయం జ్ఞాపకం వచ్చింది. తన అప్పుల జాబితాలో కిరాణాదుకాణం వేసుకోవాలి అక్కడా అయిదువందలదాకా అయి ఉంటుంది.

"చేసేవాడిదీ, తినేవాడిదీ గొప్ప. తెచ్చేవాడిది ఏముంది? రెండు స్వీట్లు కాకపోతే ఇరవై చేయించమంటావు రేపు నీ కూతురి పెళ్ళి చేస్తున్నావుగా! అప్పుడు చూద్దాం ఎంత సంబరంగా చేయిస్తావో."

పరంధామయ్య లడ్డూల పళ్ళెం అందుకున్నాడు. "వడ్డన పూర్తయ్యేసరికి సగం నువ్వే తినేసేటట్లున్నావు. పెళ్ళివారికన్నా మిగలాలా.. ?"

వెంకట్రామయ్య మూతి తుడుచుకున్నాడు బయట ముష్టివాళ్ళ గోలెక్కువవుతోంది. గోడల వెంబడి పంక్తులుగా కూర్చున్నారు వాళ్ళు

"సాయంత్రం రండి... భోజనాలు కాలేదు. అప్పుడే ఏంటి గొడవ. దూరంగా ఉండండి, తగులుతారు." వెంకట్రామయ్య ప్రహరీ గేటుదగ్గర నిలబడి, బెల్లంమీద ఈగల్ని తోలినట్లు ముష్టివాళ్ళను తోలుతున్నాడు వాళ్ళు అటూ ఇటూ పరుగెత్తినట్లే పరుగెత్తి మళ్ళీ గుమ్మంమీదకు వస్తున్నారు.

వెంకట్రామయ్యకు తోడు నరహరి వచ్చాడు

"అలగా మూక కదురా! వీళ్ళు ఇలా పోరు పోలీసుల్ని పిలిస్తేగాని..."

"వాళ్ళతో ఎందుకురా గొడవ? నువ్వు పోయి లోపల వడ్డన సంగతి చూడు. అన్నీ అందుతున్నాయో లేదో..."

"కాజాలు రాత్రికి వడ్డించమన్నారుట గదా...! పూర్ణంబూర్లు అవుతున్నాయి. ఇంకో రెండువాయలు కాగానే అవీ వడ్డించొచ్చు." నరహరి మీదకు వస్తున్న ముష్టివాళ్ళను చేత్తో తోసేస్తున్నాడు.

"చూశావా మామయ్యా వీళ్ళ ఆత్రం. భోజనాలు కాలేదు. విస్తళ్ళు కావాలిట. తాడితాపం అంటే ఇదే. ఎంత తిన్నా వీళ్ళ కడుపు నిండదు" నరహరి తన లోకానుభవాన్ని సూక్ష్మంగా వివరిస్తున్నాడు.

"చంటోడికి ఒక ముద్ద వేయించండి దొరా! నిన్న పొద్దుగాల్నించి ఒక మెతుకు ముట్టలేదు." ఒకత్తె చంటిపిల్లాడిని లాక్కునివచ్చి వాళ్ళకు చూపుతోంది. ముక్కు వోడిపోతోంది. చిరిగిన చొక్కాతో ముక్కు తుడుచుకుంటున్నాడు లాగూ లేదు. ఒక కాలికి చెప్పు ఉంది.

వాడిని చూడగానే నరహరికి లైటు వెలిగింది. వీడి ఫోటో తీస్తే... రామనాధం ఏదో పత్రికకు వ్యాసం రాస్తున్నాడు. ఫోటో కావాలన్నాడు. విదిలిస్తున్న చేయి ఆగిపోయింది. వాడివంక తేరిపార చూశాడు. బట్టలు సరిగా లేవుగాని గుండులాగా ఉన్నాడు. ఫోటోకి పనికిరాడు. ఒక్క ఎముకా కనిపించందే? మామూలు కెమేరాతో ఫోటో తీస్తే ఎక్స్‌రే ఫోటోలా ఉండాలి

"ఇప్పుడే శుభ్రంగా పీకలదాకా మెక్కివచ్చినట్లున్నాడు. దొంగగాడిదకొడుకు. నిన్నటినుంచీ అన్నం తినలేదంటావా? నోరు తెరిస్తే అబద్ధాలు...". రంగు చేతిలోనుంచి అందుకున్న కెమేరా మళ్ళీ చేతికి తగిలించుకున్నాడు.

"వీడు లాభం లేదురా!" అన్నాడు. ముష్టిది నిరుత్సాహపడింది. ఫొటో తీస్తే పైసలిచ్చేవాళ్ళేమో!

"నిజంగా అన్నం తినలేదయ్యా! వాడు చచ్చినంత ఒట్టు" అంది. ఈ ఒట్టుతో వీడు చచ్చిపోయినా బాగుండు అన్నంత కచ్చగా అంది. నరహరి నాలుగు పక్కలా కలయచూశాడు. బక్కచిక్కిన పిల్లవాడు ఒకడు దూరంగా గోడదగ్గర నిలబడి, మురుగులో పురుగుల్ని ఏరుకుతింటున్న తెల్లటిబాతువంక చూస్తున్నాడు. నరహరి మనసులో గొప్ప భావమేదో మెదిలింది. ఆ పిల్లవాడిని బాతు ముందుగా నిలబెట్టి ఒక ఫొటో తీసాడు. అక్కడే పంది ఒకటి బురదలో పడుకుని ఆనందంగా పరవశం పొందుతూ, పన్నీరు చల్లుకున్న పెళ్ళివారిని ఏహ్యంగా చూస్తోంది. దాన్నికూడా ఫొటోలోకి లాగవచ్చు. కావాలంటే రామనాథం వ్యాసంలో మరికొన్ని మార్పులు చెయ్యవచ్చు.

"మా ఫొటో తీస్తారా దొరా!!" బిచ్చగత్తెకు ఏదో అర్థమయినట్లుంది. "అరేయ్ ఎంకటీ, సత్తిగా రండిరా! ఎదవసచ్చినాళ్ళారా... రండిరా...". ముష్టిది గొంతెత్తగానే అందరూ ఉరుకులు, పరుగులుగా వచ్చారు. వాళ్ళ చేతుల్లో సత్తుగిన్నెలూ, చింపిగుడ్డలూ ఉన్నాయి. నలుగురైదుగురి దగ్గర ఈత ఆకుల బొత్తులున్నాయి. చాపలు అల్లుతున్నారు.

వాళ్ళల్లో ఎవరు తన ఫొటోకు పనికివస్తారా అని చూస్తున్నాడు నరహరి. ఈ హడావుడికి పరంధామయ్య బయటకు వచ్చాడు. అతన్ని పెళ్ళిపెద్దగా గుర్తించారు ముష్టివాళ్ళు.

"నీ కడుపు చల్లగ ఒక ముద్దేయించు దొరా! నీ కొడుకు కలకటేరవుతాడు. నీ కూతురు పెద్ద మేడ కట్టుద్ది. నీ ఇల్లు పదిళ్ళు అవుతాయి. అన్నం తిని రెండు రోజులయింది దొరా. పెళ్ళి విస్తళ్ళు దొరుకుతాయని ఆశపడి వచ్చాం దొరా! వీడి పొట్ట చూడండయ్యా, ఎదవ సచ్చినాడా చూపించరా పొట్ట...". దిగంబరంగా ఉన్న పిల్లవాడు గబగబా పొట్ట బాదుకున్నాడు. తల్లిగూడా రెండు దెబ్బలు వేసింది.

"నిజం దొరా... మా బతుకులు అబద్ధాలుగాని... మా మాట నిజం దొరా... పొట్ట చూపించరా..." పిల్లవాడు మళ్ళీ పొట్ట బాదుకున్నాడు. పరంధామయ్యకు పిచ్చి పట్టినట్లయింది. ఈ ప్రదర్శన సుతరామూ సహించలేకపోయాడు. తను గూడా చొక్కా విప్పిపారేసి పొట్ట బాదుకుందామన్నంత అక్కసు వచ్చింది.

"పొండి... దూరంగా తగులడండి... భోజనాలు కాగానే పిలుస్తాం... ఈ లోపున కనిపించారంటే కాళ్ళిరగ్గొడతాను" పరంధామయ్య దూకుడుగా ఇంట్లోకి వెళ్ళాడు.

పెళ్ళివారు 'కాజా'లనుకోవటం ముష్టిదాని కొడుకు విన్నట్లున్నాడు. తల్లి చెయ్యి పట్టుకుని "కాజా అంటే ఎట్లా ఉంటుందే..." అని అడుగుతున్నాడు. ముష్టిదానికి ఎలా చెప్పాలో ఏం చెప్పాలో తెలియలేదు. అనేక పెళ్ళిళ్ళలో మిఠాయిలు అనేక రకాల విస్తళ్ళలో మిగిలినవి తిన్నది. దేనిపేరు ఏమిటో ఎవరు చెప్పారు? ఎవర్ని అడిగింది?

"విస్తళ్ళు రానీరా చూపిస్తాను..." అన్నది ముష్టిది.

పెళ్ళివారికి అన్నీ అందినాయో లేదో స్వయంగా కనుక్కుని మారు అడిగి వడ్డిస్తున్నాడు

పరంధామయ్య.

"ఇంకోటి..." నరహరి మొహమాటపెడుతున్నాడు. అప్పటికి రెండు లడ్లున్నాయి విస్తట్లో.

"గురువుగారూ... మీ పేరేమిటోగాని వృధాచేయటం అంటే నా కసహ్యం... ఒకరకంగా నేరంగా గూడా పరిగణిస్తాను" ప్యాంటుతో కింద కూర్చోలేక సతమతమవుతున్న వ్యక్తి ఒకతను అన్నాడు.

"మనం విస్తట్లో వేసినవన్నీ తినేస్తే బయట ముష్టివాళ్ళకు ఏం మిగులుతుంది. అందుకని విస్తట్లో వేసింది మిగల్చకుండా తినటం సాంఘికనేరంగా పరిగణిస్తాను..." అన్నాడు ఓ జులపాల కుర్రాడు. ముంగుర్లు ముఖంమీద పడి అతను ఎవరితో మాట్లాడుతున్నాడో సరిగా తెలియటం లేదు.

"కావాలంటే ముష్టివాళ్ళకు వేరే విస్తళ్ళు వేసి వడ్డించండి..." పాంటు వ్యక్తికి కోపం వచ్చింది.

"మీ ముల్లెం పోయింది... పెళ్ళి పెద్దకు అప్పిచ్చేవాళ్ళు ఇంకా దొరికితే ఆ పనే చెయ్యవచ్చు" జులపాల కుర్రాడు జుట్టు సవరించుకున్నాడు.

లేచి నిలబడి నినాదాలు ఇచ్చే ప్రయత్నంలో ఉన్నట్లు కనిపించాడు.

"మీరు అతివాదులా. . తీవ్రవాదులా..." నరహరి కల్పించుకున్నాడు. "మేము..." ఏదో చెప్పబోయేలోపున ప్యాంటు వ్యక్తి గొంతులో లడ్డూ అడ్డుపడింది. పొలమారింది. పరిస్థితి చేయిదాటిపోతోందని భయపడ్డాడు పరంధామయ్య. ఈ సందడికాగానే ఏ ఋషీకేశమో పోయి ఆరు నెలలుండి వస్తేనేగాని బుర్ర పనిచెయ్యదు. మళ్ళీ తిరిగి రావటం గూడా అనవసరమేనేమో! వచ్చి ఏం బావుకునేది? జీవితంలో చూడాల్సినది చూడటం అయింది. చేయాల్సిన అప్పులు చెయ్యటం అయింది. ఇంకెందుకు?

భోజనాలు అయి లేస్తున్నారు అతిథులు. కొంతమంది లేవలేక సహాయం కోసం దిక్కులు చూస్తున్నారు. బయట అలజడి మొదలయింది. వీళ్ళని ఎట్లా సమర్ధించుకుని రావాలో పరంధామయ్యకు అర్థం కావటంలేదు. గుంపులు గుంపులుగా వస్తున్నారు. మిడతలదండులాగా మీదపడిపోతే చాలు వేరే ఆయుధాలు అక్కరలేదు.

"మీరంతా లైనుగా ఉంటే అందరికీ అందుతాయి..." ఎంగిలి విస్తళ్ళు అందరూ సమానంగా ధర్మంగా పంచుకోవలసిన అవసరం గురించి ఉపన్యాసం ఇచ్చేట్టుగా ఉన్నాడు నరహరి.

"ఐకమత్యం అన్నది మన జాతిలో లేదు... ఏమంటారు" అన్నాడు ఒకతను పక్కవాడితో. అతను వినిపించుకోలేదు. భుక్తాయాసం తీరేదాకా ఎక్కడ నడుం వాల్చటమా అని ఆలోచిస్తున్నాడు.

వీళ్ళు ఆలోచించేలోపున పనివాళ్ళ చేతిలోనుంచి విస్తళ్ళు లాక్కుని పారిపోయారు ముష్టివాళ్ళు. అక్కడ మెతుకులన్నీ చిందిపడ్డాయి.

"ఏమిటిరా ఆగం..."

పరంధామయ్య ముందుకు వచ్చాడు. ముష్టివాళ్ళు ఆగకుండా ముందుకు తోసుకుని వస్తున్నారు. నరహరి కిందపడబోయాడు. పందిరి గుంజ పట్టుకుని నిలబడ్డాడు. వీళ్ళకు ఇంత బలం ఎక్కడిది? నీరసంగా గోడకు చేరగిలబడ్డవాళ్ళు వీళ్ళేనా?! ఆకలికి అంత మొండిబలం ఉంటుందా? వీళ్ళ ఫొటో పడటం ఎలా ఉన్నా కెమేరా కిందపడిపోయింది.

"వీళ్ళ పని ఇట్లా కాదు..." నరహరి వాళ్ళతో కలియబడేసరికి పెళ్ళివారు వచ్చి విడదీశారు.

"మళ్ళీ పంక్తి లేవగానే విస్తళ్ళు వేస్తాం... పోయి దూరంగా కూర్చోండి..." వాళ్ళు పరంధామయ్య వంక చూడటం లేదు. లోపలకు చూస్తున్నారు. అక్కడ ఎత్తిన విస్తళ్ళు ఎవరో తెస్తున్నారు. వీళ్ళు ఇంట్లోకి వచ్చి వాటిని లాక్కుపోయేట్లున్నారు. ఎంగిలి విస్తళ్ళు బయటకు తేవద్దు అని ఇప్పుడే చెప్పి వచ్చాడు. అయినా తెస్తున్నాడు. పరంధామయ్యకు అంతులేని అశక్తత వచ్చినట్లయింది. తనమాట ఎవరూ వినరు! ఈ సంబంధం వద్దని నెత్తీనోరూ కొట్టుకుని చెప్పాడు. సంబంధం బాగాలేదని కాదు – వాళ్ళ కోరికల జాబితా పూర్తిగా చదివేశక్తి గూడా లేదు తనకు. కుర్రవాడు మంచివాడే. అయితేనేం తల్లిచాటు బిడ్డ. ఆమె మంచిదే. అయితేనేం నగలుచాటు మనిషి. పురోహితుడు మంచివాడే. వంటవాడు మంచివాడే. వియ్యంకుడు మంచివాడే. భజంత్రీలు మంచివాళ్ళే. బ్యాంకులో డబ్బులాగా వాళ్ళ మంచితనం తనకు అక్కరకు రాదు. భోజనానికి వచ్చినవాళ్ళు మంచివాళ్ళే. బయట ముష్టివాళ్ళు మంచివాళ్ళే! ఇంతమంది మంచివాళ్ళమధ్య తను బతకలేడు. అందర్నీ చంపలేడు. తాను చావలేడు. బుర్ర బద్దలయిపోయి తను చేసిన అప్పులన్నీ దొర్లిపడిపోయేట్టున్నాయి.

పళ్ళు పటపట కొరికాడు. ముష్టివాళ్ళమీద యుద్ధం ప్రకటించాడు.

"పోతారా...! లేదా?" ఊగిసలాడుతున్న ఉత్తరీయం తీసి పందిరిలోకి గిరవాటు వేశాడు. ముష్టివాళ్ళ వెంబడిపడ్డాడు వాళ్ళంతా చెల్లాచెదరయిపోతున్నారు. చేతికందితే చేతిదెబ్బ. కాలికందితే కాలి దెబ్బ. అమ్మాయి పెళ్ళికి సెలవు ఇవ్వటానికి పేచీపెట్టిన ఆఫీసరును తలచుకుని మొదటిదెబ్బ, కట్నం తగ్గటానికి ససేమిరా వీలులేదన్న వియ్యపురాలి పేరుమీద రెండోదెబ్బ. గ్రాయకం వచ్చినా చంటిపిల్లాడిలా తల్లి వెనకాల చేతకానితనాన్ని దాచుకున్న పెళ్ళికొడుకు పేరుమీద... ఒకరేమిటి... అందరిమీద అక్కసు, కచ్చ తగ్గేదాకా వాళ్ళ పేర్లను తలచుకుంటూ ముష్టివాళ్ళను బాదేస్తున్నాడు. ఈ సందడిలో ఒక చిన్న కుర్రవాడు తన కాళ్ళకిందనుంచి దూరిపోవటానికి ప్రయత్నం చేశాడు. పట్టుమని పదేళ్ళుండవు. గోచీ పెట్టుకున్నాడు, మెళ్ళో తాయెత్తుంది. వాడిని పట్టుకున్నాడు. అందరిదీ ఒక ఎత్తు. వీడి ఒక్కడిదీ ఒక ఎత్తు. తన అశక్తతను సూటిగా చూసి వెటకారం చేస్తున్నాడు. తనను తృణీకారం చేశాడు, తృణమొకచేత నొడ్డి... పరంధామయ్య పట్టలేని ఆగ్రహంతో చాచి ఒకటి కొట్టాడు. అంతే నెత్తురు చిమ్మింది. తన వేలు విరిగినట్లయింది. అంతులేని నెప్పి. వేలు ఎముక విరిగిందేమో! ఉంగరం వేలు వెనక్కు వంగింది. నెత్తురు ఎక్కడిది? పిల్లవాడి తలమీదది! ఆ పిల్లవాడి తల్లి కాబోలు పరుగుపరుగున వచ్చింది.

"నా బిడ్డను చంపేశారు... తల్లో..." అంటూ గొల్లున ఏడుస్తోంది. పరంధామయ్య పక్క కుర్చీమీద కూలబడ్డాడు. వేలు వెనక్కు వంగిపోయింది. తీపుపట్టలేకుండా ఉన్నాడు.

"తడిగుడ్డ చుట్టండి..."

"వేలు విరిగినట్లుంది... డాక్టరు దగ్గర్లో ఉన్నారా?"

"ఐస్ ఉంటే బాగుండు... కిళ్ళీబడ్డీలో ఉందేమో కొంచెం పట్టుకుని రండి..." అంతా తలొక సలహా చెబుతున్నారు.

పిల్లవాడి తల్లి నెత్తిమీద పాతగుడ్డపెట్టి తుడిచి నెత్తురు ఆగకపోతే మట్టి పూస్తోంది. మట్టి

తడిసిపోతోందిగాని నెత్తురు ఆగటం లేదు. చిమ్ముతూనే ఉంది. వేలుపెట్టి గాయాన్ని నొక్కుతూ "ఈ దెబ్బతోటి సచ్చినా బాగుణ్ణు... నా కడుపున ఎందుకు పుట్టావురా దరిద్రపు సచ్చినోడా.. ఇంత పెపంచం ఉంటే నా కడుపున ఎందుకు పుట్టావురా..." చేత్తో బాదుతోంది.

పరంధామయ్యను డాక్టరు దగ్గరకు తీసుకుని వెళ్ళటానికి రిక్షా తెచ్చారు. ఎవరో ఉత్తరీయం తెచ్చి ఇచ్చారు.

"ఈ అలగా జనాన్ని చేత్తో కొట్టగూడదయ్యా బావా... కర్ర తీసుకోవాలి గాని..." వెంకట్రామయ్య సానుభూతి ప్రకటించాడు.

పరంధామయ్య మెల్లిగా అడుగువేస్తూ రిక్షాలో కూర్చున్నాడు. తలమీద దెబ్బతిన్న పిల్లవాడు తల్లి ఒడిలో కళ్ళు మూస్తూ తెరుస్తూ "అమ్మా... కాజా... ఎట్లా ఉంటుందే..." అంటున్నాడు. పరందామయ్య చేతి ఉంగరం మెల్లిగా తీసి, దానికి అంటి ఉన్న నెత్తురు తుడిచి వెంకట్రామయ్యకు ఇచ్చాడు. మెల్లిగా రిక్షా దిగి ముష్టిదాని దగ్గరకు వెళ్ళి "దీనికి ఇంత అన్నం పెట్టండి..." అన్నాడు. పిల్లవాడిని మెల్లిగా ఎత్తి భుజంమీద వేసుకుని రిక్షాలో పోయి కూర్చున్నాడు

"రిక్షాకు ఎంతివ్వాలి...?"

"రూపాయికి మాట్లాడారు బాబూ..."

"సరే... పద..."

తన అప్పు ఇంకో రూపాయి పెరిగింది. ఇంత అప్పు తీర్చగలిగినవాడు, ఈ రూపాయి అప్పు తీర్చలేకపోడు. పోనీ ఈ రూపాయి అప్పు ఒక్కటీ తీర్చి మిగతా అప్పంతా ఎగ్గొట్టి ఎక్కడకన్నా పారిపోతే!? పరంధామయ్య వేలినొప్పి కొంచెం తగ్గినట్లయింది.

**(తెలుగునాడు - 1-15 సెప్టెంబర్, 1979)**